క్లుప్తంగా

మహిళ అదృశ్యంపై ఫిర్యాదు


అదృశ్యమైన మహిళ

నగరి: పట్టణ పరిధిలోని పెరుమాళ్లగుడి వీధికి చెందిన మహిళ(52) అదృశ్యమైంది. ఈ నెల 2వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె మళ్లీ తిరిగి రాలేదు. బంధువులు, తెలిసినవాళ్ల వద్ద వారం రోజుల పాటు ఆరాతీసిన ఆమె కుమారుడు దండపాణి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే 80997 18633 నెంబరుకు తెలియజేయాలని పోలీసులు తెలిపారు.

నగరి సీఐగా విక్రమ్


సీఐ విక్రమ్

నగరి: నగరి అర్బన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా విక్రమ్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో నగరి సీఐగా ఉన్న మహేశ్వర్ బదిలీపై చిత్తూరు మహిళా పోలీస్ స్టేషన్‌కు వెళ్లడంతో తిరుపతి ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న విక్రమ్ బదిలీపై నగరికి విచ్చేశారు. గతంలో నగరి పట్టణంలో ఎస్‌ఐగా పని చేసిన అనుభవం ఉందని, శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

నూతన పైపు ఏర్పాటు చేయండి


చేతిపంపు

వడమాలపేట (విజయపురం): మండల కేంద్రం వడమాలపేట ఆదిఆంధ్రవాడలోని చేతి పంపులో పాత పైపును తొలగించి కొత్త పైపు ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. పాత పైపులన్నీ తుప్పు పట్టడంతో తాగు నీరు ఇనుము వాసన వస్తుందని తెలిపారు. గ్రామంలో ఓవర్ ట్యాంక్ ఉన్నా, విద్యుత్ లేని సమయంలో చేతిపంపు నీటినే వాడుకొంటున్నారు. అధికారులు పాత పైపులను తొలగించి నూతన పైపులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

చికెన్ వద్దు.. చేపలే ముద్దు

గుడిపాల: మాంసాహారులు ఆదివారం వచ్చిందంటే చికెన్ ముక్కలేనిదే ముద్ద తినరు. అయితే ఇప్పుడు చాలామంది ప్రజలు బర్డ్‌ఫ్లూ భయంతో చికెన్ తినడం మానేశారు. అయితే మటన్ కొందామంటే మార్కెట్లో కిలో రూ.750 నుంచి రూ.850 వరకు పలుకుతోంది. దీన్ని కొనలేని సామాన్య జనం చేపలవైపు మొగ్గుచూపుతున్నారు. దీంతో చేపలు ధర కూడా అమాంతం పెరిగిపోయింది. నిన్న మొన్నటి వరకు కిలో రూ.150 పలికిన చేపలు, ప్రస్తుతం రూ.200 నుంచి రూ.220 వరకు విక్రయిస్తున్నారు. అయినప్పటికీ సామాన్య జనం చికెన్ తినలేక చేపలు కొంటున్నారు. ఆదివారం చికెన్ సెంటర్లు జనం లేక వెలవెలబోయాయి. అదే సమయంలో చేపల వ్యాపారం జోరుగా సాగింది.

కోడెగిత్తల జోరు..


బంగారుపాళెం: ముంగరమడుగులో పరుగులు తీస్తున్న కోడెగిత్త

బంగారుపాళెం: మండలంలోని ముంగరమడుగు గ్రామంలో ఆదివారం నిర్వాహకులు ఎడ్ల పందేలు నిర్వహించారు. కనుమ పండుగ సందర్భంగా నిర్వహించిన ఈ పందేలకు పరిసర ప్రాంతాల నుంచే కాకుండా తమిళనాడు నుంచి యజమానులు పశువులను టెంపోల ద్వారా తీసుకువచ్చారు. పరుగులు తీస్తున్న కోడెగిత్తలను నిలువరించేందుకు యువకులు పోటీ పడ్డారు. ఈ క్రమంలో పలువురికి గాయాలయ్యాయి. పోటీలో గెలుపొందిన ఎద్దుల యజమానులకు నిర్వాహకులు బహుమతులను ప్రదానం చేశారు. పశువుల పరుగు పందెంను తిలకించేందుకు పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. పశువుల పరుగు పందెం కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే మురళీమోహన్ పాల్గొన్నారు.

సహజ సేద్యం.. ఆరోగ్యం తథ్యం


ప్రకృతి పద్ధతిలో సాగు చేసిన ముల్లంగి తోట పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

ప్రకృతి సిద్ధమైన, పర్యావరణ అనుకూలమైన సేంద్రియ వ్యవసాయం వైపు రైతులు ప్రయాణిస్తున్నారు. కృత్రిమంగా తయారయ్యే రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడకుండా కేవలం కంపోస్టు, పచ్చిరొట్ట తదితర జీవాధారిత ఎరువులతో పంటలు పండించే పాత విధానమే మేలంటున్నారు. కాలుష్యాన్ని తగ్గిస్తూ, నేల సారాన్ని సంరక్షిస్తూ అటు రైతుల, ఇటు వినియోగదారుల ఆరోగ్యాన్ని కాపాడే ఈ విశిష్ట సేద్యం ప్రస్తుతం మండలంలో విస్తరిస్తోంది.

- సేంద్రియ కషాయాలతో చీడపీడల నివారణ
- సహజ సిద్ధ వ్యవసాయం వైపు రైతు ప్రయాణం
- సేంద్రియ పద్ధతుల్లో విస్తృతంగా కూరగాయల సాగు


ద్రవజీవామృతం తయారీ

నింద్ర: సేంద్రియ వ్యవసాయం రైతులకు అధిక దిగుబడులు సాధించి పెడుతోంది. ఈ పద్ధతిలో చీడపీడలను పూర్తిగా నివారించవచ్చునని రైతులకు బోధపడింది. దీంతో మండలంలోని అత్తూరు, అగరం, పాదిరి గ్రామల్లో రైతులు ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు చూపుతున్నారు. రైతులకు సేంద్రియ కషాయాలు తయారు చేసే విధానాలపై విస్తృతంగా అవగహన కల్పిస్తున్నారు. వారే తమకు కావాల్సిన కషాయాలను తయారు చేసుకుని, వివిధ పంటలకు పిచికారీ చేసుకుంటున్నారు. లేదా పంటకు పారే నీరుతో కలసి కషాయం పెట్టడం చేస్తూ మంచి దిగుబడులు పొందుతున్నారు. మండలంలో సేంద్రియ పద్ధతిలో 20 ఎకరాల్లో వరి పంట, 7 ఎకరాల్లో మిరప, 5 ఎకరాల్లో వంగ, 10 ఎకరాల్లో బెండ, 4 ఎకరాల్లో టమాటా, 5 ఎకరాల్లో ముల్లంగి, అర ఎకరంలో ఆకుకూరలు సాగు చేస్తున్నారు.

భూమి సారవంతమవుతోంది

సేంద్రియ వ్యవసాయం చేయడం వలన ఎరువుల వాడకం తగ్గించడంతోపాటు సేంద్రియ కషాయాలు వాడడంతో భూమి సారవంతమౌతుంది. దీంతో ప్రతి పంట నాణ్యతగా ఉంటుంది. కూరగాయ పంటలను చీడపీడల బారి నుండి పూర్తిగా కాపాడుకోగలం, మార్కెట్‌కు ఆరోగ్యకరమైన పంటలను సరఫరా చేయవచ్చు.

సేంద్రియ కషాయం తయారీ

2 కేజీల నల్ల బెల్లం, 2 కేజీల శనగపిండి, 10 లీటర్లు ఆవు పంచితం వేర్వేరుగా నిల్వవుంచాలి. 25 రోజుల తరువాత 100 లీటర్లు నీటిలో కలిపి కషాయం తయారు చేయాలి. వివిధ పంటలకు పిచికారీ చేయడంతో పంటలకు సోకిన చీడపీడలు తొలగిపోతాయి. పంట ఏపుగా పెరిగి మంచి దిగుబడి లభిస్తుంది. మండలంలోని రైతులకు మూడు సంవత్సరాల క్రితం వ్యవసాయశాఖ అధికారులు కషాయాల తయారీ, ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. రైతులు కషాయం తయారు చేసి తమ పంటలకు పిచికారీ చేసుకుంటున్నారు.


కషాయం తయారు చేస్తున్న రైతు

నాణ్యమైన దిగుబడి సాధ్యం



ప్రకృతి ఆధారంగా తయారు చేసుకునే కషాయాలు, ద్రావణాలు పంటలపై పిచికారీ చేస్తే చీడపీడలు ఆశించవు. వాటిని ముందుస్తుగానే నివారించుకోవచ్చు. కషాయాల తయారీకి ఖర్చు కూడా ఉండదు. రసాయనిక మందులు పిచికారీ చేస్తే ఉత్పత్తులు విషతుల్యం అవుతాయి. నేల సారం కోల్పోతుంది. దీంతో మరింత ఆధికంగా రసాయనాలు వినియెగించాల్సి వస్తుంది ఇది రైతులు గుర్తించాలి.

–చంద్రశేఖర్, ప్రకృతి వ్యవసాయ శిక్షకుడు, నగరి డివిజన్

సేంద్రియ కషాయాలతో అధిక దిగుబడి



నేను రెండు ఎకరాల్లో వేరుశనగ, మిరప పంటలు సాగు చేశాను. ఈ పంటలకు ఎక్కువ శాతం సేంద్రియ కషాయాలతో సాగు చేస్తున్నా. గతంలో రసాయన ఎరువులు వాడి దిగుబడి సక్రమంగా లేదు. ఖర్చు ఎక్కువయ్యేది. వ్యవసాయ శాఖ చెప్పిన ప్రకారం సేంద్రియ సాగు చేపట్టాను. దిగుబడి బాగుంది. ఖర్చు తక్కువ స్వయంగా కషాయాలు తయారు చేసుకుంటున్నాం.

–సంపత్, రైతు అత్తూరు

నేటి నుంచి అభిషేక పండుగలు

కార్వేటినగరం: నేటి నుంచి అభిషేక పండుగలు నిర్వహించనున్నట్లు బేతేల్ షారోన్ చర్చి పాస్టర్ ఆశీర్వాదం తెలిపారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రతి ఏడాది మార్చి నెలలో నిర్వహించే అభిషేక పండుగలు సోమవారం నుంచి బుధవారం వరకు మూడు రోజులపాటు ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి చెన్నై నుంచి థామస్ చాకో ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. ముఖ్య ప్రసంగీకులు, అంతర్జాతీయ టీవీ ప్రసంగీకులు పాస్టర్ కళ్యాణ్‌బాబు పాల్గొంటారన్నారు. వీరితో పాటు పాస్టర్లు బాబు, మోసస్ బాలన్ పాల్గొని ప్రభువు ప్రవచనాలను వివరిస్తారని తెలిపారు. మండలంలోని క్రిస్టియన్లు కార్వేటినగరం సంతగేటులో జరిగే అభిషేక పండుగ వేడుకల్లో పాల్గొనాలని కోరారు.

ఎంపీటీసీ కుటుంబానికి పరామర్శ


ఎంపీటీసీ కుటుంబాన్ని పరామర్శిస్తున్న కుమార్‌స్వామిరెడ్డి తదితరులు

విజయపురం: మండలంలోని కోసలనగరం ఎంపీటీసీ కన్నెమ్మ కుటుంబాన్ని మాజీ మంత్రి ఆర్కే రోజా సోదరుడు కుమార్‌స్వామిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు ఆదివారం పరామర్శించారు. ఇటీవల కనెమ్మ అవ్వ నరసమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా వారి కుటుంబాన్ని పరామర్శించి, సంతాపం తెలిపారు. ఆయన వెంట మండల కనీవ్వనర్ శివరాజు, శేఖర్‌రాజు తదితరులు ఉన్నారు.

శాస్త్రోక్తంగా రాజగోపుర భూమిపూజ


ప్రత్యేక పూజలు

గంగాధరనెల్లూరు: మండలంలోని శ్రీసంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో ఆదివారం రాజగోపురం నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని శ్రీసంతాన వేణుగోపాలస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు వేదమంత్రోచ్చారణ మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజ గోపుర నిర్మాణానికి ఆలయ ట్రస్టు సభ్యులు భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. అతి త్వరలోనే ఆలయ రాజగోపురం నిర్మాణం పూర్తి చేస్తామని నిర్వాహకులు తెలిపారు.


భూమిపూజ నిర్వహిస్తున్న ట్రస్టు సభ్యులు

ఆశ కార్మికులకు పని భారం తగ్గించాలి


మాట్లాడుతున్న గౌరవ అధ్యక్షుడు కోదండయ్య

నగరి: ఆశ కార్మికులకు పనిభారాన్ని తగ్గించాలని, జీతాలు పెంచాలని, వేతనాలతో కూడిన సెలవు దినాలను ప్రకటించాలని ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు కోదండయ్య, కార్యదర్శి చందామర్రై డిమాండ్ చేశారు. ఆదివారం నగరి పట్టణంలో నిర్వహించిన ఆశ వర్కర్ల యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నియోజవర్గ జనరల్ బాడీ సమావేశంలో వారు మాట్లాడారు. 20 సంవత్సరాలుగా గ్రామాలు, పట్టణాలలో మాతాశిశు సంరక్షణతోపాటు ఆరోగ్యానికి సంబంధించి సర్వేలను చేస్తూ ప్రజలకు ఆరోగ్యపరంగా అవగాహన కల్పిస్తున్న ఆశవర్కర్లకు ప్రభుత్వం న్యాయం చేయాలన్నారు. వారికి పనిభారం తగ్గించాలని కోరారు. ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సుజాత, యూనియన్‌కు చెందిన నాయకులు ఉషా రాణి, రూప, సలీనా, నగోమి, రేవతి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కుంభాభిషేకం


ఆలయంలో హోమం

నింద్ర: మండల కేంద్రమైన నింద్ర గ్రామంలోని వినాయక ఆలయంలో ఆదివారం మహా కుంభాభిషేకం నిర్వహించారు. ఆలయంలో ఉదయం కలశ పూజ, హోమం నిర్వహించారు. అనంతరం ఆలయంలో వినాయక విగ్రహ ప్రతిష్ట నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. సాయంత్రం స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. పండరీ భజనలు, హరికథ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలో గ్రామస్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

అపూర్వం.. మధుర స్మృతుల సమ్మేళనం


నాటి గురువులకు పూర్వ విద్యార్థుల సత్కారం

తవణంపల్లె: మండలంలోని అరగొండ బాలుర హైస్కూల్లో నాలుగు దశాబ్దాల ముందు పదవ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. పాఠశాలలో 1985–86లో పదో తరగతి చదివిన విద్యార్థుల అపూర్వ సమ్మేళనం సరదాగా సందడిగా సాగింది. ఆ నాటి జ్ఞాపకాలను, అనుభూతులను, అనుభవాలను పంచుకున్నారు. రోజంతా ఆడుతూ, పాడుతూ ఉత్సాహంగా గడిపారు. విద్యాబుద్ధులు నేర్పిన 15 మంది గురువులను ఆహ్వానించారు. వారికి పాదాభివందనం చేసి శాలువలు కప్పి, పూలదండలతో సత్కరించి గురుభక్తి చాటుకున్నారు. అందరూ కలిసి భోజనాలు చేశారు. ఈ పాఠశాలకు ఆరు సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. పూర్వ విద్యార్థులు ఉమాపతి, ధర్మేంద్ర, జయంతిరెడ్డి, మన్నారు ప్రసాద్, కృపాసాగర్‌రెడ్డి, కుమార్‌నాయుడు, రెడ్డిప్రసాద్, మాధవి, కమలాపతి, సుకుమార్, పూర్ణచంద్ర, శ్రీనివాసులు హాజరయ్యారు.

పల్లెల్లో కొత్త డిజైన్లతో నిర్మాణాలు


పల్లెల్లో నిర్మించిన అందమైన ఇల్లు

విజయపురం: గతంలో పల్లెల్లో ఎక్కడో ఒక చోట సంపన్నుల కుటుంబాల ఇల్లు విశాలంగా కనిపిస్తుండేవి. ఎక్కువ భాగం గుడిసెలు, మట్టి మిద్దెలే దర్శనమిస్తుండేవి. కాలం మారింది.. ప్రజల ఆర్థిక స్థితిగతులు క్రమేణా పెరిగాయి. పిల్లలను ఉన్నత విద్య చదివించడం ద్వారా వాళ్లు ఉద్యోగాల్లో స్థిర పడుతున్నారు. పైగా ప్రజల మధ్య పోటీతత్వం పెరిగిపోయింది. వాళ్ల కంటే మన ఇళ్లే బాగా ఉండాలని పోటాపోటీగా పల్లెల్లో ఇళ్ల నిర్మాణాలు చేస్తున్నారు. గ్రామాల్లో ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.20 లక్షల నుంచి మొదలు 60, 70 లక్షలకుపై ఖర్చు చేస్తున్నారు. ఇంటి నిర్మాణానికి వెచ్చించే ఖర్చు కంటే డిజైన్లకే ఎక్కువ మొత్తంలో ఖర్చు చేస్తున్నారు. కొత్త డిజైన్లతో ఇంటీరియర్ డెకరేషన్‌కు అధిక ప్రాధాన్యమిస్తున్నారు. బయట ఎలివేషన్ మొదలు ఇంటీరియర్ ఎంపికలోనూ ఎప్పటికప్పుడు కొత్తదనాన్ని ఎంచుకుంటున్నారు.

నేడు పాలకలలో ఫ్యామిలీ డాక్టర్

ఐరాల: మండలంలోని పాలకల రెడ్డివారిపల్లెలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. గ్రామంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేస్తామని తెలిపారు. గర్భిణులకు గుండె, బీపీ పరీక్షలు చేసి తగు సూచనలు, సలహాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన


వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నగరి: పెళ్లకూరుకు చెందిన చాగణం లలితమ్మ భాస్కరరావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. బాలికోన్నత పాఠశాలలో తిరుపతి శ్రీవెంకటేశ్వర అరవింద్ నేత్రాలయ సహకారంతో ఈ శిబిరం ప్రారంభమైంది. సీనియర్ కంటి వైద్య నిపుణుడు డాక్టర్ రవితేజ ఈ శిబిరంలో పాల్గొని 150 మందికి పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. 60 మందికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 50 మందికి ఉచిత కంటి అద్దాలు అందించారు. 30 మందికి ఆపరేషన్ అవసరమని గుర్తించారు. వీరికి ఉచితంగా ఆపరేషన్ చేస్తామని ట్రస్టీ మేనేజింగ్ ట్రస్టీ చాగణం గౌరీశంకర్, సీతారామనాయుడు తెలిపారు. పరీక్షలు చేసుకున్న వారికి తగు సలహాలు, సూచనలు అందించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో సిబ్బంది కృష్ణ గల్లా, అరవింద్ నేత్రాలయ సిబ్బంది దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

23న తిరుపతిలో మాలల సింహగర్జన

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ఎస్సీ వర్గీకరణ నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23న మాలల సింహగర్జన నిర్వహించనున్నట్లు పూతలపట్టు మాజీ ఎమ్మెల్యే ఎం.ఎస్. బాబు పిలుపునిచ్చారు. చిత్తూరు నగరంలోని ఓ ప్రైవేటు హోటల్లో ఆదివారం మాలల సింహగర్జనపై సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా తిరుపతిలో ఈనెల 23న రాయలసీమ మాలల సింహగర్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గుడిపాల మండల కన్వీనర్ ప్రకాష్, మాల నాయకులు సుదర్శన్, రవి, ప్రభాకర్, పరదేశి తదితరులు పాల్గొన్నారు.


ప్రభుత్వ భూమిలో టీడీపీ నాయకుడి ఇటుక బట్టీ

దర్జాగా టీడీపీ కబ్జా

విజయపురం: ప్రభుత్వ భూముల ఆక్రమణల దందా కొనసాగుతోంది. ఎక్కడ ఖాళీ జాగా కనిపిస్తే అక్కడ అక్రమార్కులు వాలిపోతున్నారు. ఫిర్యాదులు వస్తేనే గానీ అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడంతో రూ.కోట్ల విలువైన స్థలాలు పరాధీనమైపోతున్నాయి. ఈ క్రమంలో విజయపురం మండలం బూచివానత్తం పంచాయతీ, గొల్లపల్లి గ్రామం పక్కనే సర్వే నెంబర్ 79–2లోని 1.53 ఎకరాల ప్రభుత్వ స్థలం ఉంది. ఈ భూమిని టీడీపీ నాయకులు కబ్జా చేసినట్లు స్థానిక ప్రజలు వాపోతున్నారు. స్థలం కబ్జా అవుతున్నా రెవెన్యూ అధికారులు ఏ మాత్రం పట్టించుకోలేదు. అక్రమార్కుల వెనుక షాడో ఎమ్మెల్యే బలం ఉండడంతో అధికారులు సైతం పట్టించుకోవడం లేదు. ఆక్రమిత భూముల్లో దర్జాగా ఇటుక బట్టీలు నిర్వహిస్తున్నారు. ఇటీవల పన్నూరు సబ్‌స్టేషన్ వద్ద భూముల విలువ బాగా పెరిగింది. సెంటు భూమి రూ.50 వేలు పలుకుతోంది. దీంతో కూటమి నాయకులు ఖాళీ జాగా కనిపిస్తే ఆక్రమించుకొని నకిలీ పత్రాలు సృష్టిస్తున్నారన్న ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి. గొల్లపల్లిలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమికి నకిలీ పత్రాలు తయారు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. జిల్లా అధికారులు స్పందించి ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. దీనిపై అధికారులకు ఫోన్ చేయగా స్పందించలేదు.

ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం

తహశీల్దార్ ఆదేశం మేరకు ఇంటింటికీ స్థానికులకు తెలియజేశాం. గొల్లకంద్రిగ ప్రభుత్వ స్థలంపై 145 సెక్షన్ అమలులో ఉంది. ఎవ్వరైనా ప్రభుత్వ స్థలాన్ని అక్రమించుకున్నట్లు స్థానికులు ఫిర్యాదు చేస్తే తప్పకుండాచర్యలు తీసుకుంటాం.

–చంద్రయ్య, వీఆర్‌ఓ, బూచివానత్తం


బట్టికంద్రిగలో 150 ఏళ్ల నాటి బావి

పూర్వీకుల బావి

వడమాలపేట: మండలంలోని బట్టికంద్రిగ గ్రామం రాములవారి గుడి ఎదురుగా ఉన్న బావికి 150 ఏళ్లలకు పైగా మాటే. శిథిలావస్థకు చేరుకొన్న బావిని గ్రామస్తులు మరమ్మతులు చేసి, కాపాడుకొంటున్నారు. బావిలోని నీటిని వాడుకోకపోయినా.. తమ పితృదేవతలకు గుర్తుగా పూడ్చకుండా భద్రంగా కాపాడుకొంటున్నామని గ్రామస్తులు అంటున్నారు. అప్పుడప్పుడు బావిలో పూడిక తీసి నీళ్లు కూడా ఎండపోకుండా జాగ్రత్తగా చూసుకొంటున్నారు.

జీడీ నెల్లూరులో ఉచిత వైద్య శిబిరం



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు, వైద్య బృందంతో నిర్వాహకులు

గంగాధరనెల్లూరు: కర్ణాటక రాష్ట్రం బెంగళూరు నగరంలోని వైదేహి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, బిగ్ టీవీ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన హెల్త్ క్యాంపులో 200 మంది రోగులు వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా గుండె, కాలేయం, కళ్లు, తుంటి కీళ్లు, ఎముకలు తదితర పరీక్షలను నిర్వహించారు. తద్వారా పరీక్షలు నిర్వహించి సత్వర తదుపరి వైద్య చికిత్స అవసరం ఉన్నవారికి బెంగళూరు హాస్పిటల్లో ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా ఉచితంగా వైద్యం అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో కార్పొరేట్ వైద్యశాల ఆధ్వర్యంలో బెంగళూరుకు చెందిన ప్రముఖ వైద్యులతో ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేయడం సంతోషదాయకమని, సేవలను మరింత విస్తరించాలని పలువురు నిర్వాహకులను కోరారు.